క్లుప్తంగా

మోదీ గద్దె దిగే వరకూ పోరాటాలు



భీమోలులో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

గోపాలపురం: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గద్దె దిగేవరకూ దశల వారీగా పోరాటాలు సాగిస్తామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. మండలంలోని భీమోలు గ్రామంలో శనివారం ఆమె సీపీఐ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని, లౌకిక వ్యవస్థను పరిరక్షించుకోవాలంటే ప్రధాని మోదీ గద్దే దిగాలని అన్నారు. మోదీ ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా ఈనెల 15న దేశవ్యాప్త పాదయాత్రలు చేపట్టనున్నట్టు తెలిపారు. అనంతరం భీమోలు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. నాయకులు వి. కొండలరావు, ఆచంట సత్యనారాయణ, కె కొవ్వాడియ్య, ఎంఎస్ రాజు సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

రజకుల సమస్యలపై సీఎం సానుకూలం

నల్లజర్ల: రజకుల సమస్యలపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని రజక సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నల్లజర్లలో శనివారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లా రజక సంఘ అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య, కార్యదర్శి జువ్వలపాలెపు సత్యనారాయణ(అన్నవరం) మాట్లాడుతూ ఆసరా కార్యక్రమానికి దెందులూరు వచ్చిన సీఎంకు రజకులు ఎదుర్కొంటున్న పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సంఘం తరపున అందించామన్నారు. తమ విజ్ఞప్తి, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సీఎంఓ కార్యాలయం అధికారులు రజకుల సమస్యలు పరిష్కరించాలంటూ జిల్లా అధికారులను ఆదేశించారన్నారు. దీనిపై స్పందించిన అధికారులు తమ సమస్యలు అడిగి తెలుసుకున్నారన్నారు. రజకుల వృత్తి చెరువుల జీఓ అమలు చేయాలని, ద్వారకాతిరుమలలో రజకుల కల్యాణ మండపం నిర్మాణానికి 15 సెంట్ల స్థలం మంజూరు చేయాలని, విశ్రాంతి భవనాలకు నిధులు మంజూరు చేయాలని, దోబీ ఘాట్లు, మెట్ట ప్రాంతంలో బోర్ల నిర్మాణానికి ఉమ్మడి ప.గో.జిల్లాకు రూ.20 కోట్లు మంజూరు చేయాలని కోరినట్టు చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వంలోనే లబ్ధి పొందామని వారు పేర్కొన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చిన వైఎస్సార్ సీపీకి అండగా ఉంటామని వారు స్పష్టం చేశారు.

మానవతా విలువలు అలవరుచుకోవాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): బాల్యం నుంచీ మానవతా విలువలు అలవరుచుకుని ఉత్తమ విద్యార్థులుగా తయారు కావాలని రాజమహేంద్రవరం సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ అయోధ్యల శ్యామ్‌సుందర్ పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక ఆల్కాట్ గార్డెన్ వద్ద గల సత్యసాయి మందిరంలో సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరమ్మ వర్ధంతి, బాలవికాస్ వారోత్సవాల ముగింపు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అనే మానవతా విలువలు నేర్పించి, వాటిని ఆచరింపజేయానికి తల్లిదండ్రులు, బాలవికాస్ గురువులు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాజమహేంద్రవరం జోనల్ కన్వీనర్ సీహెచ్ త్రిమూర్తులు, మందిరం అధ్యక్షుడు డి.గిరిధర్, కార్యదర్శి జి.హనుమంతరావు, రాజమహేంద్రవరం గురుకులం కమిటీ సభ్యుడు సోమసుందరరెడ్డి, జిల్లా మహిళా విభాగ్ సమన్వయకర్త రామలక్ష్మి, జిల్లా విద్యావిభాగం సమన్వయకర్త ఎల్.శ్రీనివాసరాజు, జోనల్ సమన్వయకర్త దివాకర్, ఐటీ ఇన్చార్జి దినకర్ పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో బాలికలదే పైచేయి

- ప్రైవేట్ పాఠశాలలతో పోటీ పడిన ప్రభుత్వ హైస్కూళ్ల విద్యార్థులు
- వాడపల్లి బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల్లో నూరు శాతం పాస్



దేవరపల్లి: టెన్త్ పరీక్ష ఫలితాలను ప్రభుత్వం శనివారం విడుదల చేసింది. దేవరపల్లితో సహా పలు మండలాల్లో బాలుర కంటే ఎక్కువ మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు. అలాగే ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలలు మెరుగైన ఫలితాలు సాధించాయి.మండలంలోని తొమ్మిది జెడ్పీ హైస్కూళ్ల నుంచి 937 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 665 మంది (71 శాతం) ఉత్తీర్ణత సాధించారు. వారిలో బాలికలు 339 మంది (75 శాతం), బాలురు 286 మంది (65 శాతం) ఉత్తీర్ణత సాధించారు. దేవరపల్లి జెడ్పీ హైస్కూల్ 71, యాదవోలు జెడ్పీ హైస్కూలు 36, చిన్నాయగూడెం జెడ్పీ హైస్కూలు 40, దుద్దుకూరు జెడ్పీ హైస్కూలు 50, గౌరీపట్నం జెడ్పీ హైస్కూలు 67, యర్నగూడెం జెడ్పీ హైస్కూలు 63, రామన్నపాలెం జెడ్పీ హైస్కూలు 65, త్యాజంపూడి జెడ్పీ హైస్కూలు 72, పల్లంట్ల జెడ్పీ హైస్కూలు 50 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగమే లక్ష్యం

ఇంజినీరింగ్ చేసి సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగం చేయాలనేది తమ లక్ష్యమని మండల టాపర్స్ తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల తోడ్పాటుతో కష్టపడి చదివి అత్యధిక మార్కులు సాధించినట్టు విద్యార్థులు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు,ఎంఈఓలు, ఉపాధ్యాయులు అభినందించారు.

కొవ్వూరు: పదో తరగతి పరీక్షల్లో మండలంలోని కుమారదేవం అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఇక్కడ 91 మంది విద్యార్థులకు గాను 86 మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో 12 మంది 500కి పైబడి మార్కులు సాధించారు. కొవ్వూరు మునిసిపల్ హైస్కూల్ నుంచి 74 మంది పరీక్షలు రాయగా 60 మంది పాసై, 81 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని ఎస్ఆర్‌కే హైస్కూల్ అత్యల్పంగా 33 శాతం, కొవ్వూరు బాలికల హైస్కూలు 44 శాతం ఉత్తీర్ణత సాధించాయి. వాడపల్లిలోని మహాత్మా గాంధీ, జ్యోతిబాయి పూలే బీసీ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల నూరు శాతం ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. కుమారదేవంలోని అంబేడ్కర్ గురుకుల సంక్షేమ వసతి పాఠశాల 94.5 శాతంతో రెండో స్థానంలోను, పశివేదల హైస్కూల్ 84 శాతం ఉత్తీర్ణతతో మూడో స్థానంలో నిలిచాయి. తర్వాత స్థానాల్లో 81 శాతంతో కొవ్వూరు పీఎంఎం, 82 శాతంతో ధర్మవరం హైస్కూళ్లు నిలిచాయి.

చాగల్లు మండలంలో 55 శాతం

చాగల్లు: పదో తరగతి పరీక్షల్లో మండలం 55 శాతం ఉత్తీర్ణత సాధించింది. ప్రభుత్వ పాఠశాలల నుంచి 467 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 246 మంది ఉత్తీర్ణులైనట్టు ఎంఈవో వి.ఖాదర్ బాబు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో బాలురు 54 శాతం, బాలికలు 57 శాతం ఉత్తీర్ణత సాధించారు. బ్రాహ్మణగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 61 మంది పరీక్షలకు హాజరు కాగా 37 మంది ఉత్తీర్ణులయ్యారు. ఊనగట్ల జెడ్పీ హైస్కూల్ నుంచి 73 మందికి 43 మంది, చిక్కాల జెడ్పీ హైస్కూల్ నుంచి 47 మందికి 19 మంది, మార్కొండపాడు జెడ్పీ హైస్కూల్ నుంచి 60 మందికి 37 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే మల్లవరం జెడ్పీ హైస్కూల్ నుంచి 28 మందికి 15 మంది, చాగల్లు జెడ్పీ హైస్కూల్ నుంచి 180 మందికి 83 మంది, కలవలపల్లి జెడ్పీ హైస్కూల్ నుంచి 18 మందికి 12 మంది ఉత్తీర్ణులయ్యారు. మండలంలోని ప్రైవేట్ పాఠశాలలు 90 శాతం ఉత్తీర్ణత సాధించాయి. 100 మంది పరీక్షలకు హాజరు కాగా 90 మంది ఉత్తీర్ణత సాధించారు.

నిడదవోలు పట్టణం, మండలంలో 65 శాతం

నిడదవోలు రూరల్: పది పరీక్ష ఫలితాల్లో నిడదవోలు పట్టణ, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 1232 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 806 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ డి.కిషోర్‌కుమార్ తెలిపారు. 65 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో 720 మంది విద్యార్థులకు 347 మంది ఉత్తీర్ణులయ్యారు. నిడదవోలు జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన 171 మంది విద్యార్థినులకు 100 మంది, తాడిమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 63 మంది విద్యార్థులకు 26 మంది, శెట్టిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 48 మందికి 37 మంది, పురుషోత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల 61 నుంచి మందికి 22 మంది, సమిశ్రగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 61 మంది విద్యార్థులకు 206 మంది, కాట కోటేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 39 మంది విద్యార్థులకు 18 మంది, కోరుమామిడి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 49 మంది విద్యార్థులకు 13 మంది, పెండ్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 52 మంది విద్యార్థులకు 12 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి మండలంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి విద్యాశాఖ అధికారులు, ఉపాయులు అభినందించారు.

పెరవలి మండలంలో 55.74 శాతం

పెరవలి: మండలంలోని ఏడు ఉన్నత పాఠశాలల నుంచి మొత్తం 450 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయగా వారిలో 251 మంది ఉత్తీర్ణులై 55.74 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈఓ డి.హైమావతి తెలిపారు తెలిపారు.

ఉండ్రాజవరం మండలంలో 55.47 శాతం

ఉండ్రాజవరం: మండలంలోని 8 ఉన్నత పాఠశాలల నుంచి 548 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరవగా 304 మంది పాసై, 55.47 శాతం ఉత్తీర్ణత శాతం సాధించినట్టు ఎంఈఓ పీవీఎస్ నాగరాజు తెలిపారు.

నల్లజర్ల మండలంలో 67.2 శాతం

నల్లజర్ల: మండలంలోని 9 ప్రభుత్వ,10 ప్రైవేటు పాఠశాలల నుంచి 1009 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కాగా 678 మంది ఉత్తీర్ణులయ్యారు. 67.2 ఉత్తీర్ణత శాతం నమోదైంది. బాలుర కంటే బాలికలే అత్యుత్తమ ఫలితాలు సాధించారు.

తాళ్లపూడి మండలంలో 62 శాతం

తాళ్లపూడి: టెన్త్ పరీక్షల్లో మండలం 62.78 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈవో కె. వివేకానంద తెలిపారు. మొత్తం 532 మంది పరీక్షలు రాయగా 334 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ఆరు ప్రభుత్వ హైస్కూళ్ల నుంచి 427 మందికి గాను 236 మంది కృతార్థులయ్యారు. ఆరు ప్రైవేట్ పాఠశాలల నుంచి 105 మందికి గాను 98 మంది ఉత్తీర్ణత సాధించారు.

వివాహిత అదృశ్యంపై కేసు

కొవ్వూరు: మండలంలోని ధర్మవరం గ్రామానికి మన్నెల్లి మరియ అనే వివాహిత అదృశ్యమైంది. గత నెల 9 నుంచి మరియ కనిపించడం లేదంటూ ఆమె భర్త వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్సై జి.సతీష్ తెలిపారు. హైదరాబాద్‌లో ఆయాగా పనిచేస్తున్న మరియ గత 8న ఈస్టర్ పండుగ సందర్భంగా ధర్మవరం వచ్చిందని పేర్కొన్నాడు. ఆ మరునాడే అదృశ్యమైందని, పలు చోట్ల వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభ్యం కాలేదని తెలిపారు.తొలుత హైదరాబాద్‌లో పనిచేసే చోటకి వెళ్లినట్లు భావించానని, అక్కడ ఆరా తీయగా అక్కడికి రాలేదని తెలిపారన్నారు. గ్రామానికి చెందిన మరొక వ్యక్తి కూడా కనిపించడం లేదు. .

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నల్లజర్ల: అకాల వర్షాలకు రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైందని, పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు కోరారు. పంట నష్టం జరిగిన అనంతపల్లి, పోడవరం గ్రామాలలో ఆయన శనివారం స్థానిక నాయకులతో కలసి పర్యటించారు. పంట నష్టం వివరాలను ఆయన రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చోడసాని బాపిరాజు, రుద్రా శ్రీను, పిల్లి కాంతారావు, చింతలపూడి కుమారి, తలారి సౌజన్య,ఉన్నమట్ల సత్యసూర్యకిరణ్, రమేష్, తాడ్రి నాగరాజు, జి.శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా పుట్టాలమ్మ జాతర

నిడదవోలు రూరల్: మండలంలోని సూరాపురం గ్రామ దేవత పుట్టాలమ్మ తల్లి జాతర మహోత్సవాలు రెండో రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ వీధుల్లో అమ్మవారి సేవ జరిపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విచిత్ర వేషధారణలు, బుట్టబొమ్మలు, విద్యుత్తు దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి. నిడదవోలు సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో జాతరకు వచ్చిన ఆడపడుచులు, బంధువులతో పండగ వాతావరణం నెలకొంది. ఆదివారం అమ్మవారికి నైవేద్యాలతో జాతర మహోత్సవాలు ముగిస్తాయని కమిటీ సభ్యులు తెలిపారు.

రైతులను అడ్డుపెట్టుకుని రాజకీయం

- కర్షకుల గురించి మాట్లాడే హక్కు చంద్రబాబుకు లేదు
- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: రైతులను అడ్డుపెట్టుకుని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు రాజకీయం చేస్తున్నాడని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు విమర్శించారు. దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన చంద్రబాబుపై ధ్వజమెత్తారు. టీడీపీ ప్రభుత్వం రైతులను ఏనాడూ ఆదుకోలేదన్నారు. రుణమాఫీ, బ్యాంకుల్లో బంగారం రుణాలు మాఫీ చేస్తానంటూ హామీ ఇచ్చి 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మోసగించారన్నారు. రైతుల గురించి మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. ఎన్నికల స్టంట్‌లో భాగంగానే ఆయన రైతులను అడ్డుపెట్టుకుని ముసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వస్తే రైతులు పండించిన పంటకు అడ్వాన్సులు ఇచ్చి కొనుగోలు చేస్తామంటూ చంద్రబాబు ప్రగల్భాలు పలకడాన్ని తలారి ఆక్షేపించారు. టీడీపీ అధికారంలో ఉండగా, రైతులకు పంట నష్టపరిహారాన్ని ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అకాల వర్షాలకు తడిసిన ప్రతి ధాన్యపు గింజనూ ఆర్‌బీకేల ద్వారా ప్రస్తుతం కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. దళారుల బెడద లేదని, ధాన్యం మిల్లుకు వెళ్లిన వారం రోజుల్లో రైతులకు సొమ్ము చెల్లిస్తున్నట్టు ఎమ్మెల్యే తలారి చెప్పారు. ప్రతి సీజన్‌లో రైతులకు ప్రభుత్వం పంట నష్ట పరిహారాన్ని చెల్లిస్తోందన్నారు. రైతులకు జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక విపక్షాలు బురద చల్లుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వంపై టీడీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఖండించారు. ప్రతి గ్రామంలో వ్యవసాయ అధికారిని ఏర్పాటు చేసి, ఈ-పంట నమోదు చేసి ప్రభుత్వం రైతులకు అన్నివిధాలా ఉంటోందన్నారు. పామాయిల్, పొగాకు, మొక్కజొన్న వంటి పంటలకు మార్కెట్లో మంచి ధర లభిస్తోందన్నారు. నియోజకవర్గంలో 80 శాతం ధాన్యం ఇప్పటికే మిల్లులకు చేరిందని చెప్పారు. విలేకరుల సమావేశంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు పాల్గొన్నారు.

రైతు సంఘాలకు రాయితీపై యంత్రాలు

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



వరికోత యంత్రాన్ని ప్రారంభిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద రైతు సంఘాలకు రాయితీపై యంత్ర పరికరాలు అందిస్తున్నట్టు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. దేవరపల్లిలోని హనుమాన్ రైతు సంఘానికి వ్యవసాయ శాఖ ద్వారా అందజేసిన వరికోత యంత్రాన్ని శనివారం ఎమ్మెల్యే వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరికోత యంత్రం ఖరీదు రూ.25 లక్షలు కాగా, 40 శాతం సబ్సిడీ రూ.8.80 లక్షలు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. బ్యాంకు రుణం రూ.12.50 లక్షలు ఉంటుందన్నారు. యంత్రసేవా పథకంలో రైతులకు ట్రాక్టర్లు, కల్టివేటర్లు, పవర్ టిల్లర్లు, వరికోత యంత్రాల వంటి యంత్ర పరికరాలను అందజేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షులు కూచిపూడి సతీష్, ఉపాధ్యక్షుడు కామిశెట్టి దుర్గారావు, వైస్ ఎంపీపీ సాగే సుబ్బారావు, పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

చివరి గింజ వరకూ కొనుగోలుకు చర్యలు



రావిమెట్లలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు

నిడదవోలు రూరల్: రైతులకు సకాలంలో గోనె సంచులు, రవాణా సదుపాయాలు కల్పిస్తూ చివరి ధాన్యపు గింజ వరకూ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని కొవ్వూరు ఆర్డీఓ ఎస్.మల్లిబాబు అన్నారు. మండలంలోని కాటకోటేశ్వరం, తిమ్మరాజుపాలెం, రావిమెట్ల, తీరుగూడెం గ్రామాల్లోని కళ్లాల్లో ఎండబెట్టిన ధాన్యాన్ని ఆర్డీఓ ఎస్.మల్లిబాబు, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, తహసీల్దార్ ఎం.గంగరాజులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు సూరిబాబు మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ఆదేశాలతో మండల అధికారులు చర్యలు చేపట్టారన్నారు. పల్లారావు మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు పర్యటనలు చేస్తున్నారని విమర్శించారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేసేందుకు మండలంలో 18 రైస్ మిల్లులతో పాటు మిగిలిన మండలాల్లో మరో 7 రైస్ మిల్లులు సిద్ధంగా ఉన్నాయన్నారు. సర్పంచ్ కొండపల్లి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షులు యాళ్ల రామారావు, పెన్మెత్స చందు, వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

- అధికారులకు జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ ఆదేశం
- సత్యవాడ రైతు భరోసా కేంద్రం సందర్శన
- అధికారులతో సమావేశం



సత్యవాడలో అధికారులు, రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్

ఉండ్రాజవరం: రైతులకు అధికారులు అందుబాటులో ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ ఆదేశించారు. మండలంలోని సత్యవాడ రైతు భరోసా కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన అక్కడే అధికారులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న వాతావరణ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ విధానంలో కూడా రైతుల ధాన్యాన్ని దగ్గరలో ఉన్న మిల్లులకు పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. గోనె సంచులను ఎప్పటికప్పుడు ఆర్‌బీకేలలో అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే రైస్‌మిల్లర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని వారిని ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వి.కృష్ణారావు, తహసీల్దార్ జి.కనకరాజు, ఎంపీడీఓ ఏ. శ్రీనివాసు, ఏవో ఎం.విశ్వేశ్వరరావు, డీటీ దివాకర్, వైఎస్సార్ సీపీ నాయకుడు ఐవీఎస్ రాజు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

రాజమహేంద్రవరం రూరల్: గర్భిణుల స్కానింగ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వైద్య, ఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్ హెచ్చరించారు. జిల్లాలో వైద్య, ఆరోగ్య శాఖ అమలు చేస్తున్న వివిధ కార్యాక్రమాలపై ప్రోగ్రాం అధికారులు, వైద్యులతో శనివారం బొమ్మూరులోని వైద్య,ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జననీశిశు సంరక్షణ పథకాలు అందరికీ సమర్థంగా అందేలా పర్యవేక్షించాలన్నారు. సమగ్ర సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సమీక్షించి వివరాలు తెలుసుకున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌కు సంబంధించి మిడ్ లెవిల్ హెల్త్ ప్రొవైడర్లు ముందురోజే ఆయా గ్రామాల్లోని గర్భిణులు, బాలింతలకు తెలియజేయాలన్నారు. అసంక్రమిత వ్యాధులు (ఎన్‌సీడీ) కార్యక్రమం క్రింద బ్యాక్‌లాగ్ లేకుండా ఏఎన్ఎం, ఆశలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ ఇవ్వాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రుల్లో నిర్వహిస్తున్న ప్రసవాలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం ఆయన స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ సుస్థిరత, పరిరక్షణకు వాకథాన్

- ఓఎన్జీసీ ఎసెట్ మేనేజర్ అమిత్ నారాయణ్
- నగరంలో ఉత్సాహంగా ర్యాలీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పర్యావరణ సుస్థిరత, పరిరక్షణకు వాకథాన్ నిర్వహిస్తున్నట్లు ఓఎన్జీసీ రాజమండ్రి ఎసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎసెట్ మేనేజర్ అమిత్ నారాయణ్ అన్నారు. దేశాన్ని పర్యావరణ హితంగా తీర్చిదిద్దాలన్న ప్రధాని నరేంద్రమోదీ పిలుపును సాకారం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇంధనం పొదుపుపై ప్రజలను చైతన్యవంతం చేయడానికి ఓఎన్జీసీ ఆధ్వర్యంలో స్థానికంగా ఏర్పాటు చేసిన వాకథాన్‌ను శనివారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ప్రకాశం నగర్‌లోని ఓఎన్జీసీ డిస్పెన్సరీ నుంచి ప్రారంభమైన ర్యాలీ రామాలయం సెంటర్, గెయిల్ ఆఫీస్ మీదుగా గోల్ఫ్ క్లబ్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా అమిత్ నారాయణ్ మాట్లాడుతూ ఈ సంవత్సరం నెట్ జీరో వైపు శక్తి పరిరక్షణ థీమ్‌తో సాక్షం- 2023 ను జరుపుకొంటోందని, దీనిలో భాగంగా ఓఎన్జీసీ 2030 నాటికి 45 శాతం సంప్రదాయ వనరులను వినియోగించుకుంటుందన్నారు. ముఖ్యంగా సంస్థ ఇంధన వృథాను అరికట్టడం, లీకేజీలను గుర్తించడంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోందన్నారు. ర్యాలీలో ఓఎన్జీసీ అధికారులు, ఎస్పీఎఫ్ సిబ్బంది, కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా కమిటీ గౌరవ సలహాదారుగా వాసిరెడ్డి పద్మ

సీటీఆర్ఐ: మహిళా కమిషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మను రాజమహేంద్రవరం మహిళా కమిటీకి గౌరవ సలహాదారుగా వ్యవహరించాలని ఉమెన్ కమిటీ కార్యవర్గం కోరింది. మహిళా కమిటీ ఏర్పాటులో కీలక పాత్ర వహించి, సుదీర్ఘకాలం గతంలో పద్మ ఈ కమిటీకి సెక్రటరీగా పనిచేశారు. శనివారం మహిళా కమిటీ నిర్వాహకులతో సమావేశం అయ్యారు. కమిటీ క్రియాశీలకంగా పనిచేయాలని అందుకు తగిన కార్యక్రమాలు రూపొందించాలని ఈ సమావేశంలో చర్చించారు. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా జక్కంపూడి విజయలక్ష్మి, అధ్యక్షురాలిగా లక్ష్మీ శ్రీనివాస్, కార్యదర్శిగా గ్రంధి లలిత, కోశాధికారిగా కె.విజయలక్ష్మిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా డాక్టర్ జె.పద్మశ్రీ, సునీత సిన్హా, మాటూరి మంగతాయారు ఎన్నికయ్యారు.

సమన్వయంతో మండలాభివృద్ధికి తోడ్పడండి

- ఎంపీపీ వీరాస్వామి
- చాగల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



సమావేశంలో ఎంపీపీ వీరాస్వామి, ఎంపీడీవో రాంప్రసాద్ తదితరులు

చాగల్లు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ మట్టా వీరాస్వామి సూచించారు. చాగల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ వీరాస్వామి అధ్యక్షతన నిర్వహించారు. మండలంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ఆయా శాఖల అధికారులు సభలో వివరించారు.ఉద్యానశాఖాధికారి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల గాలివానకు మండలంలో నేలవారిన అరటి, మొక్కజొన్న పంటలను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదికలను పంపించామన్నారు. ఆర్‌బీకే ద్వారా రైతుల ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. ఈఇవో వి.ఖాదర్‌బాబు మాట్లాడుతూ నాడు-నేడు రెండో దశలో పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. హౌసింగ్ ఏఈ కె.వెంకటరమణ మాట్లాడుతూ మండలంలో గృహనిర్మాణ లబ్ధిదారులకు సిమెంట్, స్టీల్, ఇసుక కూపన్‌లు, డోర్ ఫ్రేమ్‌లు, డోర్‌లు, శానిటేషన్ పైప్‌లు, విద్యుత్ వైర్లు, రంగులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. చాగల్లు, నందిగంపాడు గ్రామాల్లో గోదాముల ద్వారా వాటిని అందిస్తున్నామన్నారు. ఎంపీడీవో బి.రాంప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహించరాదన్నారు. సమావేశంలో ప్రతిపాదించిన పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు. వైస్ ఎంపీపీ చెల్లింకుల శ్రీవిజయ, ఎంపీటీసీలు ఇంటి కృష్ణవేణి, ఉభా భాగ్యవతి, ఉన్నమట్ల విజయకుమారి, ఎస్. అర్జునరావు, తాళ్లూరి రమ్య, లకంసాని నాగసూర్య ప్రభావతి, కోఆప్షన్ సభ్యులు షేక్ పాషా, సర్పంచులు మద్దుకూరి రవి, మద్దిపాటి శ్రీరామమూర్తి, ముప్పిడి మహాలక్ష్ముడు, కుదప రాంబాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

శిక్షణతో నైపుణ్యం

ప్రకాశం నగర్: వేసవి క్రీడా శిబిరాల్లో ఇచ్చే శిక్షణతో క్రీడాకారుల్లో నైపుణ్యం మరింత పెరుగుతుందని వక్తలు అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ కళాశాలలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, తూర్పు గోదావరి జిల్లా సాకర్ అసోసియేషన్, యునెటైడ్ ఈస్ట్ గోదావరి ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఫుట్‌బాల్, త్రోబాల్, బాక్సింగ్ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. కళాశా ల ప్రిన్సిపల్ పీఏ రాజబాబు మాట్లాడుతూ వి ద్యార్థులు వేసవి శిక్షణ ను సద్వినియోగం చేసుకొని ఆయా క్రీడల్లో నైపుణ్యం సాధించాలన్నారు.